సాక్షి
కర్నూలు
బుధవారం, 10, మే, 2023



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలోని శనగల బసవన్నకు, క్షేత్రపాలకుడు శ్రీబయలు వీరభద్ర స్వామికి మంగళవారం శాస్త్రోక్తంగా ఈఓ లవన్న, అర్చకులు పూజలను నిర్వహించారు.



కిడ్నీలను దెబ్బతీసే లూపస్

లూపస్‌ను తీవ్రమైన ఆటో ఇమ్యూన్ వ్యాధిగా వైద్యులు పేర్కొంటారు. ఈ వ్యాధి మనిషి శరీరంలోని ప్రతి అవయవాన్ని ప్రభావితం చేస్తుంది. నేడు వరల్డ్ లూపస్ డే సందర్భంగా కథనం. ..8లో



భ్రామరికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబాదేవికి మంగళవారం మూలనక్షత్రం సందర్భంగా ఊయలసేవను నిర్వహించారు. అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు.

న్యూస్‌రీల్

గురుకుల ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

కర్నూలు(అర్బన్): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల/కళాశాలల్లో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి ఏప్రిల్ 24న జరిగిన పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు జిల్లా గురుకుల విద్యా సంస్థల సమన్వయకర్త డాక్టర్ ఇంజేటి శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష రాసిన విద్యార్థినీ, విద్యార్థులు https://apgpcet.apcfss.in/ వెబ్‌సైట్ ద్వారా ఫలితాలను తెలుసుకోవచ్చన్నారు. జిల్లాలోని 14 విద్యా సంస్థల్లో ప్రవేశ పరీక్ష ఫలితాల నేపథ్యంలో అడ్మిషన్లకు తదుపరి వివరాలను త్వరలోనే తెలియజేస్తామన్నారు.

సబ్సిడీపై దాణామృతం

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాకు ప్రభుత్వం 900 టన్నుల దాణామృతం (టీఎంఆర్) కేటాయించింది. కర్నూలు జిల్లాకు 400 టన్నులు, నంద్యాల జిల్లాకు 500 టన్నుల ప్రకారం దాణామృతం కేటాయించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. దాణామృతం కోసం పాల ఉత్పత్తిదారులు, రైతులు సంబంధిత రైతుభరోసా కేంద్రాల ఇన్‌చార్జీలను సంప్రదించాలన్నారు. కిలో పూర్తి ధర రూ.రూ.15.80 ఉండగా.. రైతులు కిలోకు రూ.6.50 ప్రకారం చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో రైతుకు గరిష్టంగా 1,800 కిలోల దాణామృతం సబ్సిడీపై ఇస్తారు. ఆర్‌బీకే ఇన్‌చార్జీల ఇండెంటు ఆధారంగా దాణామృతం సరఫరా చేయనున్నారు.

ఇంటర్ సప్లిమెంటరీలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

కర్నూలు(అర్బన్): జిల్లాలోని సాంఘిక సంక్షేమ కళాశాల వసతి గృహాల విద్యార్థులు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్సీ సంక్షేమం, సాధికారత అధికారి ఎస్‌పీఎస్ఎన్ రెడ్డి చెప్పారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని ఎనిమిది కళాశాల వసతి గృహాల్లో ఇంటర్ మొదటి సంవత్సరం 302 మంది విద్యార్థులకు గాను 115 మంది ఉత్తీర్ణులయ్యారని, అలాగే ద్వితీయ సంవత్సరంలో 176 మందికి గాను 97 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ఫెయిల్ అయిన విద్యార్థుల్లో బాలురకు సప్లిమెంటరీ పరీక్షలు ముగిసే వరకు చిన్నటేకూరు సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్‌లో, బాలికలకు దిన్నెదేవరపాడులోని సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రత్యేకంగా కోచింగ్ ఇస్తున్నట్లు తెలిపారు.

హెచ్‌ఆర్‌సీ చైర్మన్‌ను కలసిన కలెక్టర్, ఎస్పీ

కర్నూలు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్‌సీ) చైర్మన్ జస్టిస్ మాంధాత సీతారామమూర్తిని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం వారు రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలోని హెచ్‌ఆర్‌సీ కార్యాలయంలో ఆయనను కలిసి జిల్లాకు సంబంధించిన వివిధ కేసులపై చర్చించినట్లు సమాచారం. వారి వెంట హెచ్‌ఆర్‌సీ జ్యుడీషియల్ సభ్యుడు దండే సుబ్రమణ్యం ఉన్నారు.

పాలిసెట్‌కు సర్వం సిద్ధం

కర్నూలు సిటీ: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. రాష్ట్ర సాంకేతిక విద్య బోర్డు నేడు నిర్వహించే ఈ పరీక్షకు జిల్లాలో 20 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో కర్నూలు ప్రాంతాల్లో 13 కేంద్రాలు, ఆదోని ప్రాంతంలో 7 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఏపీ పాలిటెక్నిక్ కాలేజీల జిల్లా కన్వీనర్ ఎ.చక్రవర్తి వెల్లడించారు. ఉదయ 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే ఈ పరీక్షకు మొత్తం 7,240 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు.

మహానందీశ్వరుడి హుండీ ఆదాయం రూ. 33.78 లక్షలు



మహానంది: మహానందీశ్వరస్వామి వారికి హుండీ కానుకల ద్వారా రూ.33,78,554 ఆదాయం లభించినట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. స్థానిక అభిషేక మండపంలో మంగళవారం హుండీ కానుకల లెక్కింపు నిర్వహించారు. ఈ మేరకు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వర, కోదండరామాలయం, వినాయకనంది, ఆంజనేయస్వామి ఆలయాల్లోని హుండీ కానుకల ద్వారా రూ. 33,16,386 ఆదాయం వచ్చిందన్నారు. అలాగే అన్నదానం విభాగం ద్వారా రూ. 49,310, గోసంరక్షణ ద్వారా రూ. 12,858 వచ్చిందని చెప్పారు. మొత్తం 41 రోజులకు ఈ మేరకు ఆదాయం వచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ మధు, సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు, ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, అర్చకులు, సిబ్బంది, భమరాంబ, శ్రీకృష్ణ దత్తసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఆపదలో అన్నలా!



● తిరిగి వస్తాననుకోలేదు

తల్లిదండ్రుల మధ్యలో నిల్చున్న ఈ విద్యార్థి పేరు మల్లెపోగు కుమార్. సి.బెళగల్ మండలం సంగాల గ్రామం. స్థానిక ఎస్సీ కాలనీలో నివసించే దేవరాజు, సొంతమ్మ దంపతుల కుమారుడు. మణిపూర్ రాజధాని ఇంఫాల్ దగ్గర ఉన్న లోగోల్‌లో ఇంజినీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల అక్కడ చోటుచేసుకున్న అల్లర్లలో చిక్కుకుని నరకం అనుభవించాడు. ఏం చేయాలో తెలియక ఈనెల 6వ తేదీ అర్ధరాత్రి తోటి తెలుగు విద్యార్థులతో కలిసి ఏపీ భవన్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేశారు. వారు స్పందించి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం.. ప్రత్యేక విమానం ఏర్పాటు చేసి హైదరాబాద్‌కు అక్కడి నుంచి ఊరికి చేర్చారు. సోమవారం రాత్రి ఇంటికి చేరుకున్న ఈ విద్యార్థి తిరిగి వస్తాననుకోలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్ల ఇది సాధ్యమైందన్నారు.

- మణిపూర్‌లో చిక్కుకున్న జిల్లా విద్యార్థులు క్షేమంగా ఇంటికి
- రాష్ట్ర ప్రభుత్వం చొరవపై తల్లిదండ్రుల హర్షం
- సీఎం వైఎస్ జగన్‌కు రుణ పడి ఉంటామన్న విద్యార్థులు
- అక్కడి పరిస్థితులను సాక్షితో పంచుకున్న పలువురు

రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. పైసా ఖర్చులేకుండా ఉన్నత విద్యనందిస్తోంది. చదువులపై ఇతర ప్రాంతాలకు వెళ్లేవారికి సాయం చేస్తోంది. అంతేకాదు ఏదైనా కారణంతో ఆపదలో చిక్కుకుంటే జగన్ సర్కారు తోడుగా నిలబడుతోంది. నేనున్నానని భరోసా ఇస్తోంది. మణిపూర్‌లో చిక్కుకొని సురక్షితంగా సొంతూర్లకు చేరిన విద్యార్థులే ఇందుకు నిదర్శనం.



కర్నూలు(సెంట్రల్): ఉన్నత విద్య కోసం మణిపూర్‌కు వెళ్లి అక్కడి అల్లర్లలో చిక్కుకున్న తెలుగు విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రాత్రి సురక్షితంగా ఇళ్లకు చేర్చింది. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తక్షణమే స్పందించి తీసుకురాకపోతే తమ ప్రాణాలు గాల్లో కలిసిపోయేవని కొందరు విద్యార్థులు పేర్కొంటున్నారు. పైసా ఖర్చులేకుండా విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం విమానాల ద్వారా హైదరాబాద్‌కు, అక్కడి నుంచి ప్రత్యేక బస్సుల్లో స్వస్థలాలకు చేర్చింది. అయితే, మణిపూర్‌లో ఐదు రోజుల పాటు చోటు చేసుకున్న అల్లరు, దోపిడీలు, కర్ఫ్యూ సమయంలో పడిన బాధలను మంగళవారం సాక్షితో కొందరు పంచుకున్నారు.

ఉమ్మడి జిల్లా నుంచి 11 మంది...

ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన మొత్తం 11 మంది విద్యార్థులు మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో చదువుకుంటున్నారు. ఇందులో ఏడుగురు ఎన్ఐటీలో బీటెక్ చదువుతుండగా, నలుగురు సెంట్రల్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో అగ్రి కోర్సులు చేస్తున్నారు. కాగా, సెంట్రల్ అగ్రి కల్చర్ వర్సిటీలో ఉన్న విద్యార్థులకు పెద్ద ఇబ్బందులేమీలేవు. అయితే, కర్ఫ్యూ ఉండడంతో బయటకు రావడానికి వీలు లేకుండా పోయింది. మణిపూర్ ఎన్ఐటీలో చదువుతున్న విద్యార్థులు మాత్రం నరకం చూశారు. ఎన్ఐటీ చుట్టు పక్కలే ఎస్టీ రిజర్వేషన్ కోసం పోరాటం చేస్తున్న మైతీ తెగ జీవనం సాగిస్తోంది. దీంతో ఆ ప్రాంతంలో తీవ్ర అల్లర్లు చెలరేగాయి. దోపిడీలు జరిగాయి. ఈ క్రమంలో మే 3 నుంచి 8వ తేదీ వరకు ఎన్ఐటీ విద్యార్థులు అడుగు బయటపెట్టడానికి వీలు లేకుండా పోయింది. రోజుకు లీటర్ వాటర్..రెండు పూటల భోజనమే దొరికేది. ఐదు రోజులుగా స్నానం చేయడానికి కూడా నీరు లభించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం 6 గంటలకే హాస్టళ్లలో లైట్లు ఆఫ్ చేసి బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన పరిస్థితి. దీనికితోడు చుట్టు పక్కల బాంబుల మోత మోగేది. పక్కన ఏం జరుగుతుందో తెలియక దిక్కుతోచేది కాదు. ఇలాంటి పరిస్థితుల్లో తల్లిదండ్రుల చెంతకు చేరడం ఎలా అని ఆందోళన చెందుతున్న విద్యార్థులకు ఏపీ ప్రభుత్వం తీపి కబురు అందించింది. సొంత ఖర్చులతో సర్కారే ఈనెల 8న అందరినీ విమానాల ద్వారా హైదరాబాద్‌కు తీసుకువచ్చి..అక్కడి నుంచి వారి స్వస్థలాలకు బస్సుల ద్వారా చేర్చింది. దీంతో వారు, వారి తల్లిదండ్రులు, బంధువులు, మిత్రులు ఊపిరి పీల్చుకున్నారు.

● ఖర్చుకు వెనుకాడకుండా

మణిపూర్‌లో విద్యార్థులు చిక్కుకున్నారని తెలియగానే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే స్పందించారు. ఖర్చుకు వెనుకాడకుండా పిల్లలను క్షేమంగా ఇళ్లకు చేర్చాలని ఆదేశించారు. దీంతో అధికారులు వెనువెంటనే ప్రత్యేక విమానాలు ఏర్పాటు చేసి ఇంఫాల్ నుంచి విద్యార్థులను హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. అక్కడి నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి వారి స్వస్థలాలకు చేర్చారు. పిల్లల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిన సర్కారు రవాణా, భోజన వసతి ఖర్చులను సొంతంగా భరించింది. మణిపూర్ నుంచి తీసుకొచ్చిన వారిలో రాష్ట్ర వ్యాప్తంగా 161 మంది ఉండగా అందులో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన వారు 11 మంది ఉన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం



నేను మణిపూర్ ఎన్ఐటీలో బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాను. అల్లర్ల కారణంగా కాలేజీ చుట్టుపక్కల బాంబులు, తుపాకుల మోత మోగేది. ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలిసేది కాదు. తల్లిదండ్రులకు ఫోన్ చేస్తే వారు భయపడేవారు. దిక్కుతోచని స్థితిలో ఉన్న మమ్మల్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సురక్షితంగా ఇళ్లకు చేర్చారు. ఆయనకు రుణపడి ఉంటాం.

– లోకనాథరెడ్డి, రెవెన్యూ కాలనీ, కర్నూలు

రోజుకు లీటర్ వాటరే గతి



నేను ఇంఫాల్ ఎన్ఐటీలో బీటెక్ చదువుతున్నాను. అక్కడ అల్లర్లు చెలరేగడంతో కాలేజీకి సెలవులు ఇచ్చారు.కర్ఫ్యూ విధించడంతో ఊరికి రావాలన్నా రాలేని పరిస్థితి. అక్కడే హాస్టల్‌లో బిక్కుబిక్కుమంటూ ఐదు రోజులు గడపాల్సి వచ్చింది. రోజుకు లీటర్ వాటరే గతి. రెండు పూటలు మాత్రం అన్నం పెట్టేవారు.

– మదన్‌కుమార్, నంద్యాల

ఐదు రోజులు నరకం అనుభవించాం



మాది ఎమ్మిగనూరు తాలూకా నందవరం. నేను మణిపూర్ ఎన్ఐటీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాను. అక్కడ చెలరేగిన అల్లర్లతో ఐదు రోజులు నరకం అనుభవించాం. స్నానం చేయడానికి నీళ్లు లేవు. తినడానికి సరిగ్గా అన్నంలేదు. ఎందుకంటే అల్లర్ల వల్ల హాస్టల్ వారు కూడా బయటకు వెళ్లడానికి వీలు లేదు.

– సేలంరాజు, నందవరం

బాంబుల మోతతో భయమేసేది



నేను మణిపూర్ ఎన్ఐటీలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్నాను. మైతీ తెగ ఎన్ఐటీ చుట్టు పక్కలే ఉండడంతో రోజు బాంబుల బ్లాస్టు జరిగేది. భయంతో హాస్టల్ గేట్లు మూసేసుకొని లోపలే ఉండేవాళ్లం. బతికేతే చాలనుకున్నాం. సీఎం జగనన్న స్పందించి మమ్మల్ని మా తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. ఆయనకు కృతజ్ఞతలు.

– వి.సాయి చక్రధర్, కర్నూలు

తల్లిదండ్రులను చూస్తాననుకోలేదు



ఇంఫాల్ అగ్రికల్చర్ సెంట్రల్ యూనివర్సిటీలో బీఎస్సీ థర్డ్ ఇయర్ చదువుతున్నాను. అల్లర్ల కారణంగా కాలేజీకి సెలవులిచ్చారు. అయితే కర్ఫ్యూ ఉండడంతో బయటకు రావడానికి వీలు లేకుండా ఉండేది. మళ్లీ తల్లిదండ్రులను చూస్తామని అనుకోలేదు. సీఎం రూపాయి ఖర్చు లేకుండా మమ్మల్ని మా ఇళ్లకు చేర్చి పుణ్యం కట్టుకున్నారు.

– శివకుమార్, కర్నూలు

ఉదయం ఎండ.. సాయంత్రానికి వాన



కర్నూలు నగరంలో జోరు వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటం.. సాయంత్రానికి వాతావరణంలో మార్పులు చోటు చేసుకొని. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తోంది. కర్నూలు జిల్లాలో సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకు 15 మండలాల్లో వర్షం కురిసింది. హొళగుందలో గరిష్టంగా 40.2 మి.మీ., వర్షపాతం నమోదైంది. జిల్లా మొత్తం మీద 5.1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కర్నూలు జిల్లా మే నెల సాధారణ వర్షపాతం 40.1 మిమీ కాగా ఇప్పటికే 64.2 మి.మీ., వర్షపాతం నమోదైంది. మద్దికెర మండలానికి సంబంధించి సాధారణ వర్షపాతం 34.9 మి.మీ., ఉండగా 153.2 మి.మీ., వర్షపాతం నమోదు కావడం విశేషం. నంద్యాల జిల్లాలోనూ 8 మండలాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. ఇక్కడ మే నెల సాధారణ వర్షపాతం 36.9 మిమీ ఉండగా.. 60.2 మి.మీ., వర్షపాతం నమోదైంది. శ్రీశైలం మండల సాధారణ వర్షపాతం 29.4 మి.మీ., ఉండగా.. 176 మి.మీ., వర్షపాతం నమోదు కావడం విశేషం. కాగా మంగళవారం మధ్యాహ్నం నుంచే కర్నూలు సహా వివిధ మండలాల్లో ఉరుములు, మెరుపులతో తేలికపాటి వర్షం కురిసింది. సోమవారం ఒక్కరోజు ఉమ్మడి జిల్లాలో మూడు పిడుగుపాటు ఘటనలు జరిగాయి. ముగ్గురు మృతి చెందగా.. రెండు మూగజీవులు మరణించాయి.

ఆరోపణలకు ఆధారాలు ఏవీ లోకేష్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

- మైనారిటీ ఎమ్మెల్యేను అప్రతిష్టపాలు చేసేందుకు యత్నించారు
- కోవిడ్ సమయంలో మీరంతా ఇంట్లో ఉంటే నేను సేవలు చేశా
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): టీడీపీ నేత నారా లోకేష్ తనపై అసత్య ఆరోపణలు చేసి ఆధారాలు చూపలేకపోయారని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక పాతబస్తీలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మసీదుకు సంబంధించిన వక్ఫ్ ఆస్తులను తాను కబ్జా చేసినట్లు చేసిన ఆరోపణలను నిరూపించాలని సవాల్ చేశానని చెప్పారు. దీనిపై లోకేష్‌తో పాటు స్థానిక టీడీపీ నేతలు ఎవరూ ముందుకు రాకపోవడంతో అవన్నీ అవాస్తవాలే అని నిర్ధారణ అయిందన్నారు. ఇందుకు లోకేష్ తనకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ ఆస్తులు ఆక్రమిస్తే అల్లా క్షమించడని, అందుకు అల్లా ఇల్లు అయిన మసీదులో ఖురాన్‌పై ప్రమాణం చేసేందుకు సిద్ధపడి వచ్చినట్లు చెప్పారు. 40 ఏళ్ల తరువాత అధికార పార్టీకి చెందిన మైనారిటీ ఎమ్మెల్యే కర్నూలులో ఉండి ప్రజలకు సేవలు చేస్తుంటే మానసికంగా దెబ్బ తీసేందుకు కుట్ర చేస్తున్నారని చెప్పారు. తాను పవిత్ర ఖురాన్ పట్టుకొస్తే.. టీడీపీ నేతలు ప్రెస్‌మీట్ పెట్టి 'మతాన్ని అడ్డు పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నట్లు చెప్పడం సరి కాదన్నారు. తాను నిజాయితీగా ఉన్నాను కాబట్టే ప్రమాణానికి సిద్ధపడినట్లు చెప్పారు. కోవిడ్ సమయంలో రాష్ట్ర ప్రజలు ఇబ్బందులు పడుతుంటే బాబు, లోకేష్ హైదరాబాద్‌లో తల దాచుకున్నారని, స్థానిక టీడీపీ నేతలు ఇళ్లకే పరిమితమయ్యారన్నారు. తాను మాత్రం నగరంలో ప్రాణాలు లెక్క చేయకుండా సేవలందించానని తెలిపారు. తనపై గెలవాలంటే ఆరోపణలు కాదని, ప్రజా సేవల్లో పోటీ పడాలని హితవు పలికారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

కచ్చిత పరిష్కారానికి 'జగనన్నకు చెబుదాం'

- టోల్ ఫ్రీ నంబర్ 1902
- ఎమ్మెల్యేలు కాటసాని, హాఫీజ్‌ఖాన్, డాక్టర్ జె.సుధాకర్
- జగనన్నకు చెబుదాం ఫిర్యాదులపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలి
- అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం



జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని వీక్షిస్తున్న జిల్లా ప్రజాప్రతినిధులు, కలెక్టర్, ఎస్పీ, జేసీ

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యలకు కచ్చితమైన పరిష్కారం పొందేందుకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం దోహదపడుతుందని, దీనిని వినియోగించుకోవాలని పాణ్యం, కర్నూలు, కోడుమూరు శాసనసభ సభ్యులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హాఫీజ్‌ఖాన్, డాక్టర్ జె.సుధాకర్ అన్నారు. మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరేట్ నుంచి ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ తదితరులు వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను త్వరితగతిన నాణ్యత ప్రమాణాలతో పరిష్కరించడానికి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ప్రజా సమస్యల పరిశీలనలో భాగంగా ప్రతి మండలం, జిల్లా, రాష్ట్ర సచివాలయాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమం మానిటరింగ్‌కు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పర్యవేక్షణకు ప్రభుత్వం ప్రతి జిల్లాకు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించిందని, కర్నూలు జిల్లాకు రవాణా, ఆర్‌అండ్‌బీ సెక్రటరీ ప్రద్యుమ్నాను నియమించినట్లు చెప్పారు. ఆయన నెలలో రెండుసార్లు జిల్లాలో పర్యటించి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. ముఖ్యంగా అర్హత ఉండి సంక్షేమ పథకాలకు దూరంగా ఉన్న లబ్ధిదారులు టోల్‌ఫ్రీ నంబర్ 1902కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదు సమయంలో ప్రతి ఒక్కరికీ వైఎస్ఆర్ ఐడీని కేటాయిస్తారని, దాని ప్రకారం మన సమస్య పరిష్కారం ఏ దశలో ఉందో తెలుసుకోవడానికి వీలు ఉంటుందన్నారు. ప్రతి దశలో మన సెల్‌కు మెస్సెజ్ వస్తుందని, చివరిలో సమస్య పరిష్కారం అయితే లబ్ధిదారుడు తన సంతృప్తి తెలియజేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి సమస్యకు పరిష్కారం చూపడమే జగనన్నకు చెబుదాం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని, దీనికి అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ..సంక్షేమం, అభివృద్ధి పనులను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందనివారు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ..ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు మరింత మెరుగ్గా పరిష్కారాలు చూపడమే జగనన్నకు చెబుదాం కార్యక్రమం లక్ష్యమన్నారు. వ్యక్తిగత సమస్యలను పరిష్కరించుకోవడానికి సరైన వేదిక అవుతుందన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వివక్షకు తావు లేకుండా పనిచేయాలన్న ఉద్దేశంతోనే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో జేసీ ఎస్.మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, అడిషినల్ ఎస్పీ డి.ప్రసాద్,జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, సీపీఓ అప్పలకొండ, డీఈఓ రంగారెడ్డి పాల్గొన్నారు.

మొక్క జొన్న కొనుగోళ్లకు శ్రీకారం

● గూడూరు, కోడుమూరు మండలాల్లో కేంద్రాలు ప్రారంభం

కర్నూలు(అగ్రికల్చర్) : 2022–23 రబీలో పండించిన మొక్కజొన్న పంటను మద్దతు ధర రూ.1,962తో కొనుగోలుకు మార్క్‌ఫెడ్ శ్రీకారం చుట్టింది. మంగళవారం గూడూరు మండలం కొత్తకోట, కోడుమూరు మండలం వర్కూర్ గ్రామాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించింది. మొదటి రోజు 35 టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేసినట్లు జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ రాజు తెలిపారు. ఒకటి రెండు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయని దళారులకు తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోవద్దని రైతులకు సూచించారు. పంట అమ్ముకునే రైతులు ముందుగా ఆర్‌బీకేల్లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.



కొత్తకోటలో మొక్కజొన్న కొనుగోలు చేపట్టిన దృశ్యం

వాల్మీకుల ద్రోహి చంద్రబాబు

● బాబు ఫ్లెక్సీని చీపుర్లతో కొట్టి నిరసన



నిరసన తెలుపుతున్న వాల్మీకి నాయకులు

కర్నూలు(అర్బన్): మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాల్మీకుల ద్రోహి అని, తమను ఎస్టీ జాబితాలో చేరుస్తామని మాయమాటలు చెప్పి మోసం చేశారని వీఆర్‌పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం సుభాష్ చంద్రబోస్ అన్నారు. మంగళవారం స్థానిక మహర్షి వాల్మీకి విగ్రహం ఎదుట చంద్రబాబు ఫ్లెక్సీని వాల్మీకి మహిళలు చీపుర్లతో కొట్టి నిరసన తెలిపారు. అనంతరం ఫ్లెక్సీకి నిప్పు పెట్టారు. అనంతరం సుభాష్ మాట్లాడుతూ 14 సంవత్సరాలు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు వాల్మీకులకు చేసిన మేలు ఏమీ లేదన్నారు. ప్రస్తుతం ఆయన తనయుడు లోకేష్ అధికారంలోకి వస్తే తమను ఎస్టీలుగా గుర్తిస్తామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో వాల్మీకుల పక్షాన వీఆర్‌పీఎస్ చేపట్టిన ఉద్యమాలను అణచివేసేందుకు అనేక ప్రయత్నాలు చేశారన్నారు. భౌతిక దాడులకు పాల్పడ్డారని, పలు తప్పుడు కేసులు బనాయించి వేధించారన్నారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే తమ పార్టీ ఎంపీలతో ఒక్కసారైనా పార్లమెంట్‌లో వాల్మీకుల గురించి మాట్లాడించారా? అని ప్రశ్నించారు. 2017లో తప్పుల తడకగా తీర్మానం చేసి కేంద్రానికి పంపిన బాబు మరోసారి వాల్మీకులను మోసగించేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమను ఎస్టీ జాబితాలో చేర్చాలనే సంకల్పంతో ఏకసభ్య కమిషన్‌ను నియమంచి అతి తక్కువ సమయంలో ఒక సమగ్ర నివేదిక తెప్పించుకున్నారన్నారు. ఈ నివేదికపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లుకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కోసం వీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 31న ఢిల్లీలో సంకల్ప దీక్ష చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వీఆర్‌పీఎస్ నేతలు మల్లేష్, రాముడు, గాలన్న, మహేష్, శేఖర్, మధు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రూ. 59.18 లక్షల విత్తనాలు సీజ్

ఎమ్మిగనూరు రూరల్: పట్టణంలోని విత్తన దుకాణాల్లో మంగళవారం సాయంత్రం కర్నూల్ ఏడీఏ సాలురెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. త్రివేణి దుకాణంలో రూ.59,18,967 లక్షలు విలువ చేసే పత్తి, మిరప, కూరగాయలకు సంబంధించిన విత్తనాలు గుర్తించి సీజ్ చేశారు. ఆయా విత్తనాలకు సంబంధించి సరైన సర్టిఫికెట్లు చూపకపోవడంతో వాటి విక్రయాలను నిలుపుదల చేశారు. వ్యాపారులు, దుకాణాల యజమానులు అనుమతి లేని విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, ఏఓ మహేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

సెబ్ సీఐ శ్రీనివాసులు మృతి


శ్రీనివాసులు (ఫైల్)

కోవెలకుంట్ల: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కోవెలకుంట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులు (54) మంగళవారం మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతుండగా గత నెల 13వ తేదీన చికిత్స నిమిత్తం నంద్యాల ఆసుపత్రిలో చేరారు. పెరాలసిస్‌కు గురి కావడంతో కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాదు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి వారం రోజుల క్రితం తిరిగి నంద్యాల ఆసుపత్రిలోనే అడ్మిట్ చేయించారు. అక్కడే చికిత్స పొందుతూ కోలుకోలేక మృత్యువాత పడ్డారు. కర్నూలు సెబ్ కార్యాలయంలో సీఐగా పనిచేస్తూ ఏడాదిన్నర క్రితం ఇక్కడకు బదిలీపై వచ్చారు. సీఐ మృతి పట్ల సెబ్ ఎస్‌ఐ రమేష్‌కుమార్, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.


17లోపు టెన్త్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించాలి

కర్నూలు సిటీ: ఇటీవల ప్రకటించిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు ఈ నెల 17వ తేదీలోపు ఫీజులు చెల్లించాలని డీఈఓ డా.వి. రంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7వ తేదీ నుంచే ఫీజులు చెల్లించేందుకు వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చిందన్నారు. www.bse.ap.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా పూర్తి వివరాలు తెలుసుకోవాలని ఆయన సూచించారు. రూ.50 ఆలస్య రుసుముతో ఈ నెల 18 నుంచి 22వ తేదీలోపు చెల్లించవచ్చునన్నారు. ఫీజులు చెల్లించిన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు వచ్చే నెల 2వ తేదీ నుంచి మొదలు కానున్నాయన్నారు. మొదటి రోజున తెలుగు, కాంపొజిట్ కోర్సు-1 పరీక్ష, 3వ తేదీన హిందీ, 5వ తేదీన ఇంగ్లిషు, 6వ తేదీన గణితం, 7వ తేదీన సామాన్య శాస్త్రం, 8వ తేదీన సాంఘికశాస్త్రం, 9వ తేదీన కాంపొజిట్ కోర్సు-2, సంస్కృతం, అరబిక్, పర్షియన్-1, 10వ తేదీన సంస్కృతం, పర్షియన్-2 పరీక్షలు ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహిస్తారన్నారు.

కిడ్నీలను దెబ్బతీసే లూపస్

సాధారణంగా మనలోని రోగనిరోధక వ్యవస్థ బయట నుంచి వచ్చే బ్యాక్టీరియా, వైరస్‌లపై దాడి చేసి మన శరీరానికి రక్షణ కల్పిస్తాయి. కానీ ఆ రోగనిరోధక వ్యవస్థ వల్లే శరీరానికి హాని జరిగితే కలిగే ఇబ్బందినే ఆటో ఇమ్యూన్ వ్యాధులంటారు. ఇందులో ప్రధానమైనది లూపస్. దీనిని సిస్టమిక్ లూపస్ ఎరిథమాటోసస్(ఎల్‌ఎల్‌ఈ) అని కూడా పిలుస్తారు. ఈ నెల 10వ తేదిన వరల్డ్ లూపస్ డే సందర్భంగా ఈ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కథనం.

- ఎర్రటి చారలతో ముఖం అంధవిహీనం
- లూపస్‌తో తిప్పలు
- అన్ని అవయవాలపై ప్రభావం
- ప్రధానంగా కిడ్నీపై ఎఫెక్ట్
- రోగనిరోధక వ్యవస్థపై దాడి
- లక్షలో వంద మందికి ఈ వ్యాధి
- నేడు వరల్డ్ లూపస్ డే


ముఖంపై సీతాకోక చిలుక ఆకారంలో ఏర్పడ్డ లూపస్ వ్యాధి లక్షణాలు

కర్నూలు(హాస్పిటల్): ఎస్‌ఎల్‌ఈ లేదా లూపస్‌ను తీవ్రమైన ఆటో ఇమ్యూన్ వ్యాధిగా వైద్యులు పేర్కొంటారు. ఈ వ్యాధి మనిషి శరీరంలోని ప్రతి అవయవాన్ని ప్రభావితం చేస్తుంది. చాలా వరకు అవగాహన లోపం కారణంగా సరైన సమయంలో గుర్తించకపోతున్నారు. సాధారణంగా సమాజంలో ప్రతి లక్షలో వంద మందికి ఈ వ్యాధి ఉంటుంది. జిల్లాలోని రుమటాలజిస్టులు, జనరల్ ఫిజీషియన్లు, నెఫ్రాలజిస్టుల వద్దకు ప్రతి నెలా 60 నుంచి 100 మంది దాకా ఈ వ్యాధి బాధితులు చికిత్స కోసం వస్తున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో దాదాపు 5వేల మంది దాకా లూపస్‌తో బాధపడుతున్నట్లు అంచనా. శరీరంలోని కణాలు, కణజాలంపై వ్యక్తి యొక్క సొంత రోగనిరోధక వ్యవస్థ దాడి చేసినప్పుడు లూపస్ వ్యాధి అభివృద్ధి చెందుతుంది. దీనివల్ల గుండె, ఊపిరితిత్తులు, చర్మం, కీళ్లు, మూత్రపిండాలు, రక్తనాళాలు, మెదడు వంటి వివిధ అవయవాలు, శరీర వ్యవస్థకు హాని జరుగుతుంది. ఇది సిస్టమిక్ లూపస్ ఎరిథమాటోసస్, డిస్కోయిడ్ లూపస్, సబ్ అక్యూట్ క్యూటేనియస్ ల్యూపస్, డ్రగ్ ఇండ్యూస్డ్ లూపస్, నియోనెటాల్ లూపస్ అనే రకాలుగా ఉంటుంది.

ఎందుకు వస్తుందంటే...!

మొదటగా జీన్స్, పర్యావరణం (ఇన్‌ఫెక్షన్స్, కొన్ని రకాల మందులు, ఒత్తిడి, అధిక యువీ కిరణాలు) ప్రభావం వల్ల ఆటో ఇమ్యూన్ వ్యాధులు వస్తాయి. ముఖ్యంగా 15 నుంచి 45 ఏళ్లలోపు (9ః1 నిష్పత్తి) ఉన్న వారిలో వస్తుంది. అందుకు ఈస్ట్రోజెన్ అనే హార్మోన్ ప్రభావంతో వారిలో సహజంగానే వస్తుంది. అయితే ఇది చిన్నవారి నుంచి పెద్దవయస్సు వారి వారికి ఎవ్వరికైనా రావచ్చు.

వ్యాధి లక్షణాలు

లూపస్ అన్ని రకాల అవయవాలపై ప్రభావం చూపే వ్యాధి. ముందుగా చర్మం, అనంతరం కీళ్లలో మొదలుకావచ్చు. కొందరిలో కేవలం జ్వరం, నీరసం, ఆకలి తగ్గిపోవడం వంటివి కనిపిస్తాయి. ముఖ్యంగా ముక్కుపై, చెంపపై మచ్చలు సీతాకోక చిలుక ఆకారంలో ఎర్రని దద్దుర్లు కనిపిస్తాయి. దీంతో పాటు జుట్టురాలిపోవడం, కీళ్లనొప్పి, ఉదయం లేవగానే కండరాలు పట్టేయడం(30 నిమిషాల పాటు) వంటి సమస్యలుంటాయి. గాఢంగా శ్వాస తీసుకున్నప్పుడు ఛాతిలో నొప్పి, చేతి, కాలివేళ్లు గోధుమరంగు, ఊదా రంగులోకి మారిపోవడం, నోటిలో పుండ్లు వస్తాయి.

సకాలంలో చికిత్స తీసుకోకపోతే...!

- ఈ వ్యాధిని సకాలంలో గుర్తించి చికిత్స తీసుకుంటే ప్రాణాంతకం కాదు. ఒకవేళ సరిగా గుర్తించకపోవడం, మందులు సరిగా వాడకపోవడంతో శరీరంలో క్రానిక్ ఇన్‌ఫ్లమేషన్ ఉండి అనేక అవయవాలు ప్రభావితమయ్యే అవకాశం ఉంది.
- కిడ్నీ ఎఫెక్ట్ కావడం వల్ల మూత్రంలో ప్రొటీన్స్ ఎక్కువ మోతాదులో బయటకు వెళ్లిపోతాయి. ఆ తర్వాత కిడ్నీ మరింత తీవ్రంగా దెబ్బతింటుంది.
- మెదడు, నరాలు దెబ్బతినడంతో తలనొప్పి, చూపు దెబ్బతినడం, మానసిక వ్యాధులు, పక్షవాతం, మూర్ఛవ్యాధి లాంటివి కూడా లూపస్‌లో భాగంగా వచ్చే ప్రమాదం ఉంది.
- గుండెకండరాలు దెబ్బతిని కొన్నిసార్లు గుండె పోటు కూడా వచ్చే అవకాశం ఉంది.
- శరీరంలో రోగనిరోధకశక్తి బలహీన పడటంతో పలుమార్లు ఇన్‌ఫెక్షన్స్ వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయి.
- ఎముకల్లో రక్తసరఫరా సరిగా లేకపోవడంతో ఎముకల్లో కణాలు చనిపోయి సులభంగా ఎముకలు విరిగిపోతాయి.
- లూపస్ వ్యాధి ఉండే గర్భిణిల్లో అబార్షన్స్ ఎక్కువసార్లు అవుతాయి. మరికొందరిలో బీపీ అధికంగా ఉంటుంది.

దీర్ఘకాలిక చికిత్స అవసరం



లూపస్(ఎస్‌ఎల్‌ఈ) వ్యాధికి ప్రత్యేకమైన వైద్యపరీక్షలు ఏమీ లేవు. కేవలం రోగి వ్యాధి లక్షణాలు, ఆ వ్యక్తిని శారీరకంగా పరీక్షించడం, కొన్ని రకాల రక్తం, మూత్రం పరీక్షల ద్వారా వ్యాధిని నిర్ధారించవచ్చు. వ్యాధిలక్షణాలను బట్టి ఈ వ్యాధిని గుర్తించి చికిత్స అందిస్తారు. ఇమ్యునో సప్రెసెంట్స్, బైలాజిక్స్ మందులు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ వ్యాధిని పూర్తిగా నయం చేయలేము కాబట్టి దీర్ఘకాలంగా చికిత్స అందించాల్సి ఉంటుంది. సాధారణ వ్యాయామం, ఎండకు తిరగకుండా ఉండటం, సన్ ప్రొటెక్షన్ క్రీమ్ వాడటం, సరైన నిద్ర, ఒత్తిడి లేకుండా ఉండటం చేయాలి.

– డాక్టర్ ఎ. సృజన, రుమటాలజిస్టు, కర్నూలు

కిడ్నీపై ప్రభావం అధికం



లూపస్‌లో కొన్నిసార్లు 90 శాతం మందికి కిడ్నీపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇది 18 నుంచి 50 ఏళ్ల స్త్రీలలో అధికంగా వస్తుంది. 50 శాతం రోగుల్లో నేరుగా కిడ్నీపై ప్రభావం చూపుతుంది. ప్రారంభంలోనే కాళ్లవాపు, ముఖంవాపు, మూత్రం ఎర్రగా రావడం వంటి లక్షణాలు ఉంటాయి. యూరిన్‌లో ప్రొటీన్ ఎక్కువగా పోవడం, మూత్రం ఎర్రగా రావడం, క్రియాటినిన్ లెవెల్స్ పెరగడాన్ని చూసుకుంటూ ఉండాలి. దీన్ని నిర్లక్ష్యం చేస్తే కిడ్నీలు దెబ్బతింటాయి. కిడ్నీలు పూర్తిగా దెబ్బతినకుండా వైద్యపరీక్షలు చేయించుకుంటూ మందులు వాడుకుంటూ ఉంటూ 20 ఏళ్ల పాటు కిడ్నీలను కాపాడుకోవచ్చు.

– డాక్టర్ వెంకట పక్కిరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, నెఫ్రాలజి విభాగం, జీజీహెచ్, కర్నూలు

ఆదాయం పెంపుపై దృష్టి సారించండి

- మార్కెట్ కమిటీ సెక్రటరీలకు రాయలసీమ మార్కెటింగ్ శాఖ జేడీ ఆదేశాలు
- గత ఏడాది 100 శాతం ఫీజు వసూలు చేసిన సెక్రటరీలకు ప్రశంసాపత్రాలు


ప్రశంసాపత్రాలు పొందిన సెక్రటరీలతో జేడీ రామాంజనేయులు, డీడీ లావణ్య

కర్నూలు(అగ్రికల్చర్):మార్కెటింగ్ శాఖ ఆదాయం పెంపుపై దృష్టి సారించాలని రాయలసీమ జాయింట్ డైరెక్టర్ సి.రామాంజనేయులు ఆదేశించారు. ఫీజు వసూలుపై ఏ నెలలో కూడా అలసత్వం వహించరాదని స్పష్టం చేశారు.మంగళవారం కర్నూలు,నంద్యాల జిల్లాల్లోని వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీల సమావేశంలో ఆయన ఫీజు వసూలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆడిట్ అభ్యంతరాల పరిష్కారం తదితర వాటిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 2022-23లో లక్ష్యాలకు మించి ఫీజు వసూలు చేసిన వివిధమార్కెట్ కమిటీ సెక్రటరీలకు మార్కెటింగ్ శాఖ కమిషనర్ సంతకం చేసిన ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం జేడీ మాట్లాడుతూ.. 2023-24 సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ నెలలో కర్నూలు జిల్లాలో రూ.3.52 కోట్ల ఫీజు వసూలు చేయాలనేది లక్ష్యం కాగా...రూ.2.33 కోట్లు వసూలైందని తెలిపారు. 2022-23తో పోలిస్తే ఆదాయం పెరిగిందన్నారు. చెక్‌పోస్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆడిట్ అభ్యంతరాలకు తగిన జవాబులు ఇచ్చి పరిష్కరించుకోవాలని చెప్పారు. సమావేశంలో రాయలసీమ డీడీ లావణ్య,కర్నూలు ఏడీఎం నారాయణ మూర్తి, కర్నూలు, ఆదోని, నంద్యాల మార్కెట్ కమిటీల సెక్రటరీలు గోవిందు,శ్రీకాంత్‌రెడ్డి,కల్పన పాల్గొన్నారు.

ప్రశంసా పత్రాలు పొందిన వారు వీరే..

లక్ష్యానికి మించి ఫీజు వసూలు చేసిన వారిలో కర్నూలు జిల్లాలో పత్తికొండ మార్కెట్ కమిటీ సెక్రటరీ కార్నలీస్, ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీ సెక్రటరీ ఉమాపతిరెడ్డి, నంద్యాల జిల్లాలో పాణ్యం సెక్రటరీ జయప్రకాశ్‌రెడ్డి, నందికొట్కూరు సెక్రటరీ కృష్ణానాయక్, ఆత్మకూరు సెక్రటరీ నారాయణస్వామి ఉన్నారు.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలి

- లూజు విత్తనాలు తీసుకోవద్దు
- లైసెన్స్ కలిగిన కంపెనీల విత్తనాలు మాత్రమే కొనాలి
- జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): వచ్చే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులు విత్తనాల కొనుగోలులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. రైతులు విధిగా లైసెన్స్ పొందిన డీలరు వద్ద అనుమతులు ఉన్న కంపెనీల విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. అలాగే విధిగా రైతులు బిల్లు తీసుకోవాలని, బిల్లులో పట్టాదారు పాసుపుస్తకంలో ఉన్న ప్రకారం పేరు, ఫోన్ నెంబరు, లాట్ నెంబరు, విత్తనం బ్రాండ్ తదితర వివరాలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. బిల్లు, విత్తనాల సంచిని పంట కాలం పూర్తి అయ్యే వరకు భద్రపరుచుకోవాలన్నారు. ముఖ్యంగా లూజు విత్తనాలు, డూప్లికేట్ ప్యాకింగ్ ఉన్న విత్తనాలను కొనుగోలు చేయరాదన్నారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరలకు విత్తనాలను విక్రయిస్తే సంబంధిత వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మార్గదర్శకాలకు అనుగుణంగా విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు ఏ కారణం చేతనైనా పంట దెబ్బతింటే వ్యవసాయ శాఖ తగిన చర్యలు తీసుకుంటుందని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి


మృతిచెందిన సుబ్బారెడ్డి (ఫైల్)

కొత్తపల్లి: బైక్ అదుపుతప్పి కింద పడిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తి గాయపడ్డాడు. జీ.వీరాపురం గ్రామానికి చెందిన ద్వారకచెర్ల సుబ్బారెడ్డి(54) అదే గ్రామానికి చెందిన చాంద్‌బాషాతో కలసి బైక్‌పై సోమవారం సాయంత్రం పాములపాడు మండలం లింగాలలో బంధువులకు డబ్బులు ఇచ్చి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో తారుప్లాంటు సమీపంలోని మలుపు వద్ద బైకు అదుపుతప్పి పక్కనే ఉన్న లోతైన కాల్వలో పడ్డారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని స్థానికులు 108లో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్లారు. అప్పటికే సుబ్బారెడ్డి మృతిచెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. కాగా చాంద్‌బాషాను మెరుగైన వైద్యంకోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్ చేశారు. మృతుడి భార్య చాముండేశ్వరి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ముబీనాతాజ్ తెలిపారు.

కుక్కల దాడిలో 75 గొర్రె పిల్లలు మృతి

దొర్నిపాడు: దొర్నిపాడుకు చెందిన బత్తుల నడిపి వెంకటసుబ్బయ్య, బత్తుల రాజు, మల్లికార్జులకు చెందిన 75 గొర్రెపిల్లలపై మంగళవారం కుక్కలు దాడి చంపేశాయి. రోజులాగే బుర్రారెడ్డి పల్లె సమీపంలో గొర్రె పిల్లలకు కంచె వేసి జీవాలను మేపుకునేందుకు పొలాలకు వెళ్లారు. తిరిగి వచ్చేసరికి కుక్కలు గొర్రె పిల్లలపై విచక్షణా రహితంగా దాడి చేసి చంపేశాయి. దీంతో రూ.5లక్షల వరకు నష్టం వాటిల్లిందని గొర్రెల పెంపకం దారులు వాపోయారు. విషయం తెలుసుకున్న ఏపీ యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు యాదవ్ మృతి చెందిన గొర్రెలను పరిశీలించారు. విషయాన్ని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లి సాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కాకనూరు మనోహర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఫొటో ఆఫ్‌ది డే

జీవితం 'నిలకడగా..'!



జీవితం ఎన్నో పాఠాలను నేర్పుతుంది.. అడుగడుగునా సవాళ్లను విసురుతుంది. అన్నింటినీ ఓర్పు, సహనంతో ఎదుర్కొన్నప్పుడే ముఖంలో చిరునవ్వు కనిపిస్తుంది. భారం అనుకుంటే, ఎప్పటికీ ఎదగలేం. ప్రయత్నం చేసినప్పుడే ఫలితం ఉంటుంది. 74 ఏళ్ల ఖాదర్‌వలిని చూస్తే ఆ విషయం అర్థమవుతుంది. కష్టాలు వచ్చాయని, ఎవరూ సాయం చేయడం లేదని కాళ్లు, చేతులు సక్రమంగా ఉన్నా.. ఎంతోమంది తాగుడుకు బానిసలవుతున్నారు. ఇక జీవితం ముగిసినట్లేనని అర్థాంతరంగా తనువు చాలిస్తున్నారు. నగరంలోని బుధవారపేటకు చెందిన ఖాదర్‌వలి ఈ వయస్సులోనూ సైకిల్‌పై తన జీవితాన్ని 'నిలకడ'గా సాగిస్తున్నారు. సైకిల్‌ను బ్యాలెన్స్ చేయడమే ఓ సవాల్ అయితే, ఏడు పదులు దాటినా ఈ వృద్ధుడు ఎంచక్కా తన బతుకు బండి లాగుతున్నాడు. మంచం కోళ్లను సైకిల్‌కు తగలేసుకొని, భుజాన అందుకు సంబంధించిన కర్రలు వేసుకొని విక్రయానికి బయలుదేరుతున్నాడు. ఇలా ఇప్పటికి 45 ఏళ్లు.. నులక మంచాల తయారీని వృత్తిగా ఎంచుకొని, వాటి విక్రయం ద్వారా వచ్చిన ఆదాయంతో కష్టమనుకోకుండా జీవితాన్ని ఇష్టంగా బతుకుతుండటం విశేషం.

– ఫొటో: డి.హుస్సేన్

15 నుంచి ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వివిధ సంఘాల నాయకులు

కర్నూలు కల్చరల్: తిరుపతి పినాక సొసైటీ, పీపుల్స్ ఎంపవర్‌మెంట్, హైదరాబాద్ ఇంకమ్ ట్యాక్స్ అడిషనల్ కమిషనర్ బి.యాదగిరి ఐఆర్‌ఎస్, అమీలియో హాస్పిటల్స్ అధినేత డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ చాపె ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు నిర్వహిస్తున్నట్లు కోర్సు డైరెక్టర్, రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కె.రవికుమార్ తెలిపారు. మంగళవారం బీసీ భవన్‌లో వివిధ ప్రజా, బీసీ కుల సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు శిక్షణకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, జేకే. గ్రూప్, సివిల్స్ ప్రిపరేషన్ గైడెన్స్‌కు సంబంధించి ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఈనెల 15 నుంచి జూన్ 4వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెవెన్యూ కాలనీలోని సాయిసుబ్బయ్య రవీంద్ర హైస్కూల్‌లో తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిక్షణకు హాజరయ్యే యువతీ యువకులకు ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. వివరాలకు 91777 64147, 63010 94744 నెంబర్లను సంప్రదించాలన్నారు.

పాండురంగా.. పాహిమాం..

- కనుల పండువగా పాండురంగడి రథోత్సవం
- వేలాదిగా తరలి వచ్చిన భక్తజనం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


భక్త జన సందోహం మధ్య పాండురంగడి రథోత్సవం, (ఇన్‌సెట్) రథంలో పూజలందుకుంటున్న శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరుడు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరుడి రథోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా సాగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రితో స్వామి వారి వాహన సేవలు ముగియగా తొమ్మిదవ రోజు స్వామివారి రథోత్సవం కనుల పండువగా కొనసాగింది. ఆలయ అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యులు ఉదయం 11 గంటలకు హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాలు, డ్రమ్స్, డప్పులతో అశేష జనవాహిని మధ్య రథోత్సవం సాగింది. ఆలయం నుంచి రంగరాజుపేట, సంతపేట, అమ్మవారిశాల, గాంధీసెంటర్ వరకు రథోత్సవాన్ని నిర్వహించారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు పట్టణ ప్రజలే కాకుండా చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో రథోత్సవ ప్రాంగణం కిటకిటలాడింది. మైదుకూరు, బెంగళూరుకు చెందిన కళాకారులు కాళికాశక్తి, భద్రకాళి, బుట్టబొమ్మలు, తదితర వేషాధారణలు, చెక్క భజన కార్యక్రమాలు అలరించాయి. హైదరాబాదు నుంచి తెప్పించిన డ్రోన్ ద్వారా భక్తులపై పన్నీరు చల్లించారు. రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కోవెలకుంట్ల సీఐ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐలు వెంకటరెడ్డి, మౌలానీ, ప్రతాప్, రమేష్‌రెడ్డి తమ సిబ్బందితో గట్టి బందోబస్తు చేపట్టారు. బుధవారం మైలతేరు కార్యక్రమం జరుగనుంది.